# పెన్ పవర్
## తెలంగాణ రౌండప్

శుక్రవారం | 11 జూలై 2025 | పేజీలు 8


## 'ఇందిరమ్మ ఇళ్ల'లో ఎంపీలకు 40 శాతం కోటా ఇవ్వండి

### రేవంత్ కు రఘునందన్ లేఖ



- లబ్ధిదారుల ఎంపికలో ఎంపీలకు 40 శాతం కోటా కేటాయించాలని రఘునందన్ వినతి
- పార్టీలకు అతీతంగా 17 మంది ఎంపీలకు ఈ అవకాశం కల్పించాలని సూచన
- దీనివల్ల లబ్ధిదారుల ఎంపిక మరింత పారదర్శకంగా ఉంటుందని వ్యాఖ్య

-3 లో

## భూ కేటాయింపు 120 /1 లో..!

# నిర్మాణాలు 120 / 28లో..?

### అసలు పొలిటికల్ సఫరర్‌కి భూమి కేటాయించింది ఎక్కడ..?




- దుండిగల్ మండలం దొమ్మర పోచంపల్లి సర్వే నెంబర్ 120 ప్రభుత్వ భూమి కబ్జా..
- మేడ్చల్ జిల్లా అడిషనల్ కలెక్టర్ విజయేందర్ రెడ్డితో కబ్జాపై ప్రస్తావించగా..!
- చర్యలకు ఆదేశించిన అదనపు కలెక్టర్..
- మరోవైపు సీసీ కెమెరాల నిఘాలో అక్రమ నిర్మాణాల వ్యవహారం..
- రెవెన్యూ "ఎన్‌వోసి" లేదు.. మున్సిపల్ అనుమతులు లేవు..
- ఇప్పటికే పలువురికి విక్రయించినట్లు సమాచారం..
- ప్రభుత్వ భూమి కబ్జాపై..! కోర్టుకేసు పేరుతో రెవెన్యూ చర్యలకు జాప్యం..!
- అక్రమ కట్టడాలు కూల్చివేత మున్సిపల్ కమిషనర్‌ని అడగమన్న తహసీల్దార్..
- ప్రభుత్వ భూమిలో తమ జోక్యం ఉండదంటున్న మున్సిపల్ కమిషనర్..



-2లో

## సంతకాలు ఫోర్జరీతోనే... హెచ్‌సీఏ అధ్యక్షుడైన జగన్మోహన్ రావు..!

### ఐపీఎల్ టికెట్ల తీగ లాగితే కదిలిన డొంక

- నకిలీపత్రాలు సృష్టించిన శ్రీచక్ర క్రికెట్ క్లబ్ కవిత
- మాజీ మంత్రి కృష్ణయాదవ్ సంతకం కూడా ఫోర్జరీ
- ఐపీఎల్ టికెట్ల తీగ లాగితే కదిలిన అసలు డొంక




హైదరాబాద్ పెన్ పవర్: హెచ్‌సీఏ కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసును విచారిస్తున్న సీఐడీ ఇప్పటికే ఐదుగురిని అదుపులోకి తీసుకొని విచారిస్తోంది. ఇప్పటికే HCA అధ్యక్షుడు జగన్మోహన్ రావు, ట్రెజరర్ శ్రీనివాస్ రావు, సీఈవో సునీల్, జనరల్ సెక్రటరీ రాజేందర్ యాదవ్, ఆయన భార్య కవితలను సీఐడీ అధికారులు కస్టడీలోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు. ఈ క్రమంలో కీలక విషయాలు వెల్లడయ్యాయి.

-3 లో

## ట్యాపింగ్ ఫైల్స్: అరెస్టు నుంచి మినహాయింపు వద్దు..

### ప్రభాకర్ రావుపై సుప్రీంకు సిట్

- విచారణకు సహకరించడం లేదని పిటిషన్
- ఢిల్లీకి డీసీపీ విజయ్ కుమార్, ఏసీపీ వెంకటగిరి

హైదరాబాద్ పెన్ పవర్: ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ప్రభాకర్ రావు విచారణకు సహకరించడంలేదని, ఆయనను అరెస్టు నుంచి మినహాయించవద్దని కోరుతూ పిటిషన్ దాఖలు చేసేందుకు సిట్ సిద్ధమైంది. ఈ మేరకు డీసీపీ విజయ్ కుమార్, ఏసీపీ వెంకటగిరి ఢిల్లీ బయల్దేరి వెళ్లారు. వచ్చే నెల 4న ప్రభాకర్ రావు దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పై సుప్రీంలో విచారణ జరగనుంది. అప్పటి వరకు అరెస్టు చేయకుండా ఉండేందుకు ప్రభాకర్ రావు సుప్రీంకోర్టు నుంచి

-3 లో






# భూ కేటాయింపు 120 /1 లో..!

# నిర్మాణాలు 120 / 28లో..?

## అసలు పొలిటికల్ సఫరర్‌కి భూమి కేటాయించింది ఎక్కడ..?

- దుండిగల్ మండలం దొమ్మర పోచంపల్లి సర్వే నెంబర్ 120 ప్రభుత్వ భూమి కబ్జా..
- మేడ్చల్ జిల్లా అడిషనల్ కలెక్టర్ విజయేందర్ రెడ్డితో కబ్జాపై ప్రస్తావించగా..!
- చర్యలకు ఆదేశించిన అదనపు కలెక్టర్..
- మరోవైపు సీసీ కెమెరాల నిఘాలో అక్రమ నిర్మాణాల వ్యవహారం..
- రెవెన్యూ "ఎన్‌వోసి" లేదు.. మున్సిపల్ అనుమతులు లేవు..
- ఇప్పటికే పలువురికి విక్రయించినట్లు సమాచారం..
- ప్రభుత్వ భూమి కబ్జాపై..! కోర్టుకేసు పేరుతో రెవెన్యూ చర్యలకు జాప్యం..!
- అక్రమ కట్టడాలు కూల్చివేత మున్సిపల్ కమిషనర్‌ని అడగమన్న తహసీల్దార్..
- ప్రభుత్వ భూమిలో తమ జోక్యం ఉండదంటున్న మున్సిపల్ కమిషనర్..



**మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, జూలై 10:** ఓ పొలిటికల్ సఫరర్‌కి ప్రభుత్వ భూమి కేటాయింపు వ్యవహారంలో.. రెవెన్యూ అధికారులు పొంతనలేని సమాధానం చెబుతున్నారు.. రెవెన్యూ "ఎన్‌వోసి" లేదు, మున్సిపల్ "పర్మిషన్" లేదు..! దీనికితోడు భూమి కేటాయించింది ఒకచోట అయితే..! నిర్మాణాలు చేపడుతున్నది మరోచోట..! మరోవైపు సీసీ కెమెరాల నీడలో అక్రమార్కుల బహిరంగ కబ్జాలకు పాల్పడటం గమనార్హం.. మేడ్చల్ జిల్లా దుండిగల్ గండిమైసమ్మ మండలం దొమ్మర పోచంపల్లి సర్వే నెం.120/1 ప్రభుత్వ భూమిని, అనసూయ అనే మహిళా పొలిటికల్ సఫరర్‌కి 05-00 ఎకరాలు ప్రభుత్వం కేటాయించింది.. సంబంధిత భూమిని పొలిటికల్ సఫరర్ అనసూయ నుండి కొనుగోళ్ళతో పలువురి చేతులు మారినట్లు తెలుస్తోంది.. భూ కేటాయింపు సర్వే నెంబర్. 120/1 కాగా..! భౌతికంగా సర్వే నెంబర్ 120/28 ఆక్రమణతో నిర్మాణాలు చేపట్టడం పలు అనుమానాలకు తావిస్తోంది.. గతంలోనూ సంబంధిత అక్రమ కట్టడాలను కూల్చివేతలు చేపట్టారు..



దుండిగల్ గండిమైసమ్మ మండలం దొమ్మర పోచంపల్లిలో పొలిటికల్ సఫరర్‌కి కేటాయించిన సర్వే నెంబర్ 120/1 భూమిని, సర్వే నెం.120/28లో వినియోగించడంపై..! మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) విజయేందర్ రెడ్డితో మీడియా ప్రతినిధులు ప్రస్తావించగా..! ఆయన వెంటనే స్పందించారు.. విచారణ జరిపి తక్షణమే చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు..





## కోర్టుకేసు పేరుతో తహశీల్దార్ దాటవేసే ధోరణి..?

ప్రభుత్వ భూమిని పరిరక్షించే రెవెన్యూ అధికారులే నిర్లక్ష్యం వహిస్తున్నారని స్పష్టమవుతుంది.. సర్వే నెంబర్ 120/1లో అనసూయకు కేటాయించిన భూమి.. 120/28 వరకు ఎలా ప్రయాణించిందో కానీ..! భూ కేటాయింపు ఒకచోట- నిర్మాణాలు మరోచోట జరుగుతున్నాయి.. సంబంధిత స్థలమార్పిడి ఒకవైపు, రెవెన్యూ ఎన్‌వోసి లేకపోగా..! మున్సిపల్ అనుమతులు కూడా తిరస్కరించినట్లు వినికిడి.. ఇదే విషయంపై మీడియా ప్రతినిధులు దుండిగల్ తహశీల్దార్‌తో ప్రస్తావించగా..! కోర్టుకేసు ఉందని, దాటవేసే ధోరణితో సమాధానం చెప్పడం విశేషం.. అంతేకాదు అక్రమ నిర్మాణాలపై మున్సిపల్ కమిషనర్‌ని అడగమని తహశీల్దార్ ఉచిత సలహా కూడా ఇచ్చారట..ఇదే విషయాన్ని దుండిగల్ మున్సిపల్ కమిషనర్‌తోనూ ప్రస్తావించగా ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలపై మున్సిపల్ జోక్యం ఉండదని, కమిషనర్ స్పష్టతను ఇచ్చారు..

## ‘ఇందిరమ్మ ఇళ్ల’లో ఎంపీలకు 40 శాతం కోటా ఇవ్వండి

**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల పథకంలో పార్లమెంటు సభ్యులకు కూడా భాగస్వామ్యం కల్పించాలని బీజేపీ ఎంపీ రఘునందన్ రావు డిమాండ్ చేశారు. లబ్ధిదారుల ఎంపికలో ఎంపీలకు 40 శాతం కోటా కేటాయించాలంటూ ఆయన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఈరోజు ఓ లేఖ రాశారు. ఈ నిర్ణయం ద్వారా పేదలకు మరింత న్యాయం జరుగుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.

ఎమ్మెల్యేల మాదిరిగానే ఎంపీలు కూడా ప్రజల చేత నేరుగా ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధులని రఘునందన్ రావు తన లేఖలో పేర్కొన్నారు. అందువల్ల, ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియలో తమకు కూడా అవకాశం కల్పించాలని కోరారు. పార్టీలకు అతీతంగా రాష్ట్రంలోని మొత్తం 17 మంది ఎంపీలకు ఈ కోటాను వర్తింపజేయాలని ఆయన సూచించారు. దీనివల్ల లబ్ధిదారుల ఎంపికలో సహేతుకత, పారదర్శకత పెరుగుతాయని ఆయన స్పష్టం చేశారు.గతంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా ఎంపీగా పనిచేశారన్న విషయాన్ని రఘునందన్ రావు ఈ సందర్భంగా గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వ పథకమైన ప్రధాన మంత్రి ఆవాస్ యోజన నిధులను ఇందిరమ్మ ఇళ్ల పథకంతో అనుసంధానించడాన్ని ఆయన స్వాగతించారు. తన అభ్యర్థనపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించి, వెంటనే నిర్ణయం తీసుకుంటుందని ఆశిస్తున్నట్లు లేఖలో పేర్కొన్నారు.

## సంతకాలు ఫోర్జరీతోనే... హెచ్‌సీఏ అధ్యక్షుడైన జగన్మోహన్ రావు..! ఐపీఎల్ టికెట్ల తీగ లాగితే కదిలిన డొంక

- మొదటి పేజి తరువాయి

జగన్మోహన్ రావు హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ అయ్యేందుకు కవిత తనవంతు ప్రయత్నాలు చేసినట్టు తేలింది. శ్రీ చక్ర క్రికెట్ క్లబ్ నిర్వహిస్తున్న కవిత జగన్మోహన్ రావుకు మద్దతుగా గౌలిపురా క్రికెట్ క్లబ్ ప్రెసిడెంట్ మాజీ మంత్రి కృష్ణయాదవ్ సంతకం ఫోర్జరీ చేసినట్టు సమాచారం. ఈ పత్రాలను ఉపయోగించిన జగన్మోహన్ రావు హెచ్‌సీఏ అధ్యక్షుడయ్యారు. హెచ్సీఏ అధ్యక్షుడైన తర్వాత భారీ మొత్తంలో నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డట్టు ఆరోపణలు వచ్చాయి. దీనిపై తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు గురువా రెడ్డి ఫిర్యాదు చేయగా సీఐడీ దర్యాప్తు చేపట్టింది.

### తీగలాగితే కదిలిన డొంక

ఐపీఎల్ మ్యాచ్ ల వేళ హెచ్సీఏ వ్యవహరించిన తీరు వివాదానికి దారి తీసింది. ఐపీఎల్ టికెట్ల కేటాయింపులో భారీగా ఆర్థిక అక్రమాలు జరిగాయని తెలుస్తుండటంతో సీఐడీ దర్యాప్తును వేగవంతం చేసింది. ఈ క్రమంలో కస్టడీ విచారణలో అనేక విషయాలు వెలుగు చూస్తున్నాయి.

## ట్యాపింగ్ ఫైల్స్: అరెస్టు నుంచి మినహాయింపు వద్దు.. ప్రభాకర్ రావుపై సుప్రీంకు సిట్

- మొదటి పేజి తరువాయి

మినహాయింపు పొందారు. విచారణకు సహకరించాలని కూడా సుప్రీంకోర్టు సూచించింది. అయితే అమెరికా నుంచి వచ్చిన ప్రభాకర్ రావు సిట్ విచారణకు హాజరవుతున్నా.. కీలక ప్రశ్నలకు జవాబును దాటవేస్తుండటంతో సిట్ కస్టడీ విచారణ తప్పదని భావిస్తోంది. ఈ క్రమంలోనే సుప్రీంకోర్టును ఆశ్రయించింది.

## అనిల్ అంబానీకి మరో శుభవార్త.. వెనక్కి తగ్గిన కెనరా బ్యాంక్!





**హైదరాబాద్ పెన్ పవర్:**అనిల్ అంబానీకి చెందిన టెలికాం సంస్థ రిలయన్స్ కమ్యూనికేషన్స్ దివాలా తీసిన సంగతి తెలిసిందే. అయితే ఆర్‌కామ్ తీసుకున్న రుణాలను కెనరా బ్యాంక్ ‘మోసపూరితమైనది’ గా వర్గీకరించిన నిర్ణయాన్ని కెనరా బ్యాంక్ తాజాగా ఉపసంహరించుకుంది. బ్యాంక్ తన నిర్ణయాన్ని నేడు బాంబే హైకోర్టుకు తెలియజేయడంతో కేసు కీలక మలుపు తిరిగింది. ఈ పరిణామం ఆర్‌కామ్ తో పాటు దాని అనుబంధ సంస్థలకు కొంత ఊరటనిచ్చిందని చెప్పుకోవచ్చు.

కెనరా బ్యాంక్ నవంబర్ 8, 2024న ఆర్‌కామ్ రుణ ఖాతాను ‘ఫ్రాడ్’గా ప్రకటించింది. 2017లో మూలధన వ్యయం, రుణ చెల్లింపుల కోసం ఇచ్చిన రూ.1,050 కోట్ల రుణాలను సంస్థ దుర్వినియోగం చేసిందని.. అంతర్గత లావాదేవీల ద్వారా నిధులను మళ్లించిందని బ్యాంక్ ఆరోపించిన సంగతి తెలిసిందే. ముఖ్యంగా నిధులు మ్యూచువల్ ఫండ్‌లు, స్థిరాస్తుల్లో పెట్టుబడి పెట్టబడ్డాయని, వాటిని ఇతర సంబంధిత, సంబంధం లేని పార్టీలకు చెల్లింపులు చేయడానికి ఉపయోగించారని బ్యాంక్ పేర్కొంది. దీంతో ఆర్‌కామ్ రుణ ఖాతాలు మార్చి 9, 2017న నిరర్థక ఆస్తులుగా మారినట్లు కెనరా బ్యాంక్ వెల్లడించింది. ఆ తర్వాత ఆర్బీఐ మోసపూరిత ఖాతాలకు సంబంధించి జారీ చేసిన మాస్టర్ సర్క్యులర్ ఆధారంగా తమ వర్గీకరణ జరిగినట్లు బ్యాంక్ తెలిపింది.

అయితే రుణ ఖాతాలను ఫ్రాడ్ అని ట్యాగ్ చేయటంపై.. కెనరా బ్యాంక్ నిర్ణయాన్ని అనిల్ అంబానీ బాంబే హైకోర్టులో సవాల్ చేశారు. రుణ ఖాతాను ‘మోసపూరితమైనది’గా ప్రకటించే ముందు తమకు విచారణ అవకాశం కల్పించలేదని, ఇది సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధమని అంబానీ తరపు న్యాయవాదులు వాదించారు. %=దీ×% మాస్టర్ సర్క్యులర్, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం రుణగ్రహీతలకు విచారణ అవకాశం కల్పించకుండా వారి ఖాతాలను ‘ఫ్రాడ్’గా ప్రకటించకూడదని అంబానీ తరపు న్యాయవాదులు కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో బాంబే హైకోర్టు ఫిబ్రవరి 2025లో కెనరా బ్యాంక్ ‘ఫ్రాడ్’ వర్గీకరణ ఉత్తర్వుపై స్టే విధించింది. కెనరా బ్యాంక్ ‘ఫ్రాడ్’ ట్యాగ్‌ను ఉపసంహరించుకోవడానికి ప్రధాన కారణం బొంబాయి హైకోర్టు జోక్యం, విచారణ అవకాశం కల్పించాలనే న్యాయపరమైన ఆదేశాలని తెలుస్తోంది. రుణ ఖాతాలను ‘ఫ్రాడ్’గా ప్రకటించే ముందు రుణగ్రహీతలకు విచారణ అవకాశం ఇవ్వడం తప్పనిసరి అనే అంశంపై కోర్టు పదేపదే నొక్కి చెప్పింది. అయితే ఆర్‌కామ్ 2018 నుండి దివాలా పరిష్కార ప్రక్రియలో ఉంది. దివాలా ప్రక్రియలోకి వెళ్లకముందే ఈ రుణాలు తీసుకున్నందున, కంపెనీకి దావాల నుంచి రక్షణ ఉందని ఆర్‌కామ్ వాదించింది. ‘ఫ్రాడ్’గా వర్గీకరించడం వల్ల జరుగుతున్న దివాలా ప్రక్రియపై ఎటువంటి ప్రభావం ఉండదని కంపెనీ వెల్లడించింది. మొత్తానికి కెనరా బ్యాంక్ ‘ఫ్రాడ్’ ట్యాగ్‌ను ఉపసంహరించుకోవడం ఆర్‌కామ్ కు స్వల్పకాలిక ఉపశమనం. కానీ ఈ కేసు పూర్తిగా ముగిసినట్లు కాదు. ప్రస్తుతం బాంబే హైకోర్టు తీర్పు భవిష్యత్తులో ఇలాంటి కేసులను బ్యాంకులు ఎలా హ్యాండిల్ చేస్తాయో అన్న దానిపై ప్రభావం చూపే అవకాశం ఉంది. రుణగ్రస్తుల హక్కులను పరిరక్షించడంలో న్యాయవ్యవస్థ పాత్ర ఎంత ముఖ్యమో ఈ కేసు చెబుతోంది.

## గోల్డ్ వ్యాపారులారా జాగ్రత్త.. ఫేక్ పోలీసులు వస్తుండ్రు: ఆదిలాబాద్‌లో నకిలీ SI, CI అరెస్ట్




**హైదరాబాద్ పెన్ పవర్:**ఆదిలాబాద్ జిల్లాలో నకిలీ పోలీసుల గుట్టురట్టు అయ్యింది. పోలీసుల వేషంలో షాపు యాజమానులను బెదిరించి అక్రమ వసూళ్లకు పాల్పడుతోన్న నకిలీ ఎస్ఐ, సీఐ ఎట్టకేలకు పోలీసులకు చిక్కారు. గురువారం (జూలై 10) ఈ కేసుకు సంబంధించిన వివరాలను ఆదిలాబాద్ ఎస్పీ అఖిల్ మహాజన్ మీడియాకు వెల్లడించారు. ఇచ్చోడలో బంగారు దుకాణ యాజమానులను బెదిరించి డబ్బులు వసూలు చేసిన ఇర్ఫాన్, ప్రవీణ్ అనే నకిలీ పోలీసులను అరెస్ట్ చేశామని తెలిపారు. బంగారం అమ్మకాలలో మోసాలకు పాల్పడుతున్నారని యజమానులను బెదిరించి.. డబ్బులు ఇవ్వకపోతే కేసులు నమోదు చేస్తామని నిందితులు బెదిరించారన్నారు.

ఇలా నకిలీ పోలీస్ వేషంలో బంగారు దుకాణాల యజమానులను బెదిరించి రూ.18లక్షలు వసూల్ చేశారని తెలిపారు. హైదరాబాద్, విజయవాడ ప్రాంతాలలో మోసాలకు పాల్పడ్డారన్నారు. నకిలీ పోలీసులకు సహకరించిన వారిపై కూడా కేసులు నమోదు చేశామని తెలిపారు. నిందితుల నుంచి ఒక కారు, ఆటో, రాయల్ ఎన్ ఫీల్డ్ బైకు స్వాధీనం చేసుకున్నామని వెల్లడించారు. ఇలాంటి మోసగాళ్లతో ప్రజలు, వ్యాపారస్తులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

# కల్లులో ఆల్ప్రాజోలం కలిపిన పలు దుకాణాల లైసెన్స్ రద్దు




**హైదరాబాద్ పెన్ పవర్:** హైదరాబాద్ నగరంలోని కూకట్‌పల్లి పరిధిలో చోటుచేసుకున్న కల్తీ కల్లు ఘటన నేపథ్యంలో ఎక్సైజ్ శాఖ అధికారులు విస్తృత తనిఖీలు చేపట్టారు. ఐదు బృందాలుగా ఏర్పడిన ఎక్సైజ్ శాఖ అధికారులు పలు కల్లు దుకాణాల నుంచి నమూనాలను సేకరించి ప్రయోగశాల పరీక్షలు నిర్వహించారు. నారాయణగూడలోని ప్రయోగశాలలో ఈ పరీక్షలు జరిగాయి.కొన్ని కల్లు దుకాణాల్లో ఆల్ప్రాజోలం మత్తు మందును కలిపి కల్తీ కల్లును తయారు చేసినట్లు ఎక్సైజ్ శాఖ అధికారులు గుర్తించారు. కల్తీ కల్లును తయారు చేసిన పలు దుకాణాల లైసెన్సులను రద్దు చేసినట్లు బాలానగర్ ఎక్సైజ్ పోలీసులు ఒక ప్రకటనలో తెలిపారు.

## ఏ 'నిమిషా'నికి ఏమి జరుగునో?

## 16న ఉరి.. 14న సుప్రీంలో విచారణ



**హైదరాబాద్ పెన్ పవర్:** చట్టం కంటే అరాచకం ఎక్కువగా ఉండే హూతీల పాలనలోని యెమెన్ లో ఉరికి ఊపిరికి మధ్య కొట్టుమిట్టాడుతున్న కేరళ నర్సు నిమిషా ప్రియ కేసులో అనూహ్య పరిణామం.. భారత దౌత్య కార్యాలయం ప్రయత్నాలు ఓవైపు సాగుతుండగానే... మరోవైపు నిమిషా వ్యవహారంపై సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలైంది.కేరళలోని పాలక్కాడ్ కు చెందిన నర్సు నిమిషా ప్రియ 2008లో యెమెన్ వెళ్లారు. 2011లో వివాహం చేసుకున్నారు. యెమెన్ చట్టాల ప్రకారం స్థానికుల భాగస్వామ్యంతోనే వ్యాపారం చేయాలి. దీంతో తలాల్ అదిబ్ మెహదీ అనే వ్యక్తి పార్ట్ నర్ షిప్ లో అల్ అమన్ మెడికల్ కౌన్సిల్ ను నెలకొల్పారు. ఇప్పుడు ఈ తలాల్ మెహదీని హత్య చేసిన కేసులోనే నిమిషా ఉరి శిక్షను ఎదుర్కొంటున్నారు.కాగా, భర్త, కుమార్తె స్వదేశానికి వెళ్లాక మెహదీ నుంచి నిమిషాకు వేధింపులు మొదలయ్యాయి.

### పాస్ పోర్టు లాక్కొని..

నిమిషా నుంచి మెహదీ పాస్ పోర్ట్ లాక్కున్నట్టు కథనం. ఆమె 2017లో పారిపోయేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో మెహదీకి మత్తమందు ఇచ్చారని.. అది డోస్ ఎక్కువై మెహదీ చనిపోయాడని కథనం. ఈ కేసులో నిమిషాకు యెమెన్ కోర్టు మరణశిక్ష విధించింది. ఈ నెల 16న దానిని అమలు చేయనుంది. ఇప్పటికే గత ఏడాది నిమిషా తల్లి ప్రేమకుమారి యెమెన్ వెళ్లి.. 'బ్లడ్ మనీ' (బాధితులకు పరిహారం ఇచ్చి కేసు లేకుండా చూసుకోవడం)కి అంగీకరించారు. ఈ ప్రయత్నాలు కొలిక్కిరాలేదు. నిమిషాకు మరొక్క ఆరు రోజుల్లో ఉరి శిక్ష అనగా గురువారం సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలైంది. దీనిని సర్వోన్నత న్యాయస్థానం విచారణకు స్వీకరించింది. ఈ నెల 14న విచారణ జరగనుంది. పిటిషన్ లోని అంశాల ప్రకారం.. నిమిషాకు మరణ శిక్ష తప్పించేందుకు దౌత్య మార్గాన్ని అనుసరించేలా కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరారు. అయితే, నిమిషాకు 16న ఉరి శిక్ష అమలు ఉండగా.. రెండు రోజుల ముందు దౌత్య చర్చలు ఏమాత్రం ఫలిస్తాయో అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

# అత్యంత దారుణం... బాలికలు నెలసరిలో ఉన్నారో లేరో తెలుసుకోవాలని..!



**హైదరాబాద్ పెన్ పవర్:** అత్యంత ఘోరాతి ఘోరమైన ఘటన, దారుణాతి దారుణమైన సంఘటన తాజాగా మహారాష్ట్రలో చోటు చేసుకుంది. సభ్యసమాజం సిగ్గుతో తలదించుకోవాలా.. లేక, ఈ పనికి ఆదేశించిన, పూనుకున్న వారిని తలదించుకునేలా చేయాలా అనే ఘటన తాజాగా తెరపైకి వచ్చింది. బాలికలు పీరియడ్స్ లో ఉన్నారో లేదో తెలుసుకోవాలని ఓ స్కూలు యాజమాన్యం ఘోరానికి పాల్పడింది.అవును... థాణే జిల్లాల్లోని ఓ పాఠశాల బాత్రూమ్ లో రక్తపు మరకలు కనిపించాయి. దీంతో వాటికి కారణమైన వారిని తెలుసుకునేందుకు ఆ యాజమాన్యం దారుణమైన ఆలోచన చేసింది. ఇందులో భాగంగా.. బాలికలందరినీ వరుసగా నిలబెట్టి.. వారు పీరియడ్స్ లో ఉన్నారో, లేదో చెక్ చేయడానికి వారి వ్యక్తిగత అవయవాలను టచ్ చేసి టెస్ట్ చేశారు.వివరాల్లోకి వెళ్తే... థాణెలోని ఓ ప్రైవేటు పాఠశాలలో టాయిలెట్ ను శుభ్రం చేస్తుండగా.. రక్తపు మరకలు కన్పించాయి. దీంతో అక్కడ పనిచేసే సిబ్బంది వాటిని ఫొటోలు తీసి, స్కూల్ ప్రిన్సిపల్ కు పంపించారు. దీంతో ఆ స్కూలు ప్రిన్సిపల్ ఒక్కసారిగా ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం... ఆ స్కూల్లోని 5 నుంచి 10వ తరగతి చదువుతున్న బాలికలందరినీ కన్వెన్షన్ హాల్ కు పిలిపించారు.

ఆ బాలికలందరికీ ఆ ఫొటోలు చూపించారు. అనంతరం.. పీరియడ్స్ లో ఉన్నవారు, లేనివారు రెండు గ్రూప్ లుగా విడిపోవాలని చెప్పారు. దీంతో... ప్రిన్సిపల్ చెప్పినట్లుగానే ఆ బాలికలంతా రెండు గ్రూపులుగా విడిపోయి నిల్చున్నారు. అయితే.. అప్పటికీ వారిని నమ్మని ఆ ప్రిన్సిపల్.. మహిళా అటెండెంట్ ని పిలిపించి, నెలసరిలో లేమని చెప్పిన బాలికలను చెక్ చేయించారు.ఇందులో భాగంగా... ఆ బాలికలందరినీ వాష్ రూమ్ కి తీసుకెళ్లి వారి వారి వ్యక్తిగత అవయువాలను చెక్ చేసి మరీ కన్ఫర్మేషన్ కి వచ్చారు. దీంతో... ఇంటికెళ్లిన తర్వాత ఆ బాలికలు విషయాన్ని తమ తల్లిదండ్రులకు చెప్పారు. దీంతో వారంతా తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేస్తూ.. స్కూల్ ముందు నిరసన చేపట్టారు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశారు.దీంతో.. కేసు నమోదు చేసుకున్న పోలీసులు ప్రిన్సిపల్, మహిళా అటెండెంట్, నలుగురు టీచర్లు, ఇద్దరు ట్రస్టీలు కలిసి మొత్తం 8 మందిపై కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో ఇప్పటివరకు ప్రిన్సిపల్, ప్యూన్ ను అరెస్టు చేయగా, మిగతా వారిని విచారిస్తున్నారు.

ఈ సందర్భంగా స్పందించిన థాణే గ్రామీణ అడిషనల్ పోలీసు సూపరింటెండెంట్ రాహుల్ జల్టే... బాలికలను ఈ రకమైన తనిఖీకి గురిచేస్తున్నారని తల్లిదండ్రులు తెలుసుకున్నప్పుడు, వారు పాఠశాల వద్ద గుమిగూడి, సంబంధిత ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారని తెలిపారు. ఆ సమయంలో పరిస్థితి కొంతసేపు ఉద్రిక్తంగా మారిందని అన్నారు.ఈ కేసులోని ఎనిమిది మందిపై భారతీయ న్యాయ సంహిత (బీ.ఎన్.ఎస్.) సెక్షన్లు 74, 76, లైంగిక నేరాల నుండి పిల్లల రక్షణ (పోస్కో) చట్టం కింద కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

# మ్మెల్యే యశస్వినిరెడ్డి ప్రతి పనిలో ఝూన్సీరెడ్డి జోక్యం చేసుకుంటున్నారు: సొంత పార్టీ నేత ఆగ్రహం

- పాలకుర్తి కాంగ్రెస్‌లో భగ్గుమన్న వర్గపోరు
- ఇన్‌ఛార్జ్ ఝూన్సీరెడ్డిపై మార్కెట్ కమిటీ ఛైర్మన్ తిరుపతి రెడ్డి తీవ్ర ఆరోపణలు
- ఎమ్మెల్యే యశస్విని రెడ్డిని ఝూన్సీరెడ్డి పనిచేయనివ్వడం లేదని విమర్శ
- నియోజకవర్గంలో ఇద్దరు ఎమ్మెల్యేలు ఉన్నారంటూ ప్రజల మధ్య చర్చ!
- గెలుపు కోసం కష్టపడిన వారిని పక్కనపెట్టారని ఆవేదన
- ఎన్నికల్లో వ్యతిరేకంగా పనిచేసిన వారికే ప్రాధాన్యమంటూ ఆగ్రహం



**హైదరాబాద్ పెన్ పవర్:** పాలకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్‌లో అంతర్గత విభేదాలు ఒక్కసారిగా బయటపడ్డాయి. పార్టీ ఇన్‌ఛార్జ్ ఝూన్సీరెడ్డిపై సొంత పార్టీకే చెందిన సీనియర్ నేత, తొర్రూరు మార్కెట్ కమిటీ ఛైర్మన్ హనుమండ్ల తిరుపతి రెడ్డి తీవ్ర విమర్శలు చేశారు. నియోజకవర్గంలో ఝూన్సీరెడ్డి ఆధిపత్యం శృతి మించుతోందని, దీనివల్ల పాలకుర్తిలో ఇద్దరు ఎమ్మెల్యేలు ఉన్నారని ప్రజలు అనుకుంటున్నారని ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు.తిరుపతి రెడ్డి మాట్లాడుతూ "ఎమ్మెల్యే యశస్విని రెడ్డికి ప్రజలకు మేలు చేయాలనే తపన ఉన్నప్పటికీ, ఝూన్సీరెడ్డి ప్రతి విషయంలోనూ జోక్యం చేసుకుంటూ ఆమెకు పూర్తి స్వేచ్ఛ ఇవ్వడం లేదు. ఆమెను స్వేచ్ఛగా పనిచేయనివ్వడం లేదు" అని ఆరోపించారు. ఎన్నికల సమయంలో ఎన్నో ఇబ్బందులు పడి పార్టీ గెలుపు కోసం పనిచేసిన కార్యకర్తలను, నాయకులను ఇప్పుడు పూర్తిగా పక్కనపెట్టారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

ఎన్నికల్లో యశస్విని రెడ్డికి వ్యతిరేకంగా పనిచేసిన వారే ఇప్పుడు ఝూన్సీరెడ్డికి అత్యంత సన్నిహితులుగా మారారని తిరుపతి రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. "అందరినీ కలుపుకుపోవడంలో విఫలమయ్యారు. నేను అమెరికా నుంచి ఝూన్సీరెడ్డిని రాజకీయాల్లోకి రమ్మని ఆహ్వానించాను. కానీ ఆ తర్వాత వారి తీరు మారింది. ఈ విధానం మార్చుకోవాలని ఎన్నోసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదు" అని ఆయన తెలిపారు.

# జనసైనికులకు గుడ్ న్యూస్.. మీ పేరు పవన్ డైరీలో ఉందంటే మాత్రం?

**హైదరాబాద్ పెన్ పవర్:**ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చాలా జాగ్రత్తగా వ్యవహరిస్తున్నారు. పవన్ కల్యాణ్ రాజకీయాల్లోకి రావడమే సేవే మార్గంగా వచ్చారు. నిజానికి పవన్ కల్యాణ్ కు డబ్బులకు కొదవలేదు. పేరు ప్రతిష్టలు సంపాదించుకోవాలన్నదీ లేదు. ఎందుకంటే ఆయనకు సినీ హీరోగానే పవర్ స్టార్ గా లక్షలాది మంది అభిమానులను సంపాదించుకున్నారు. తక్కువ సినిమాలు చేసినా మెగా స్టార్ చిరంజీవికి మించిన అభిమానులను సంపాదించుకోగలిగారంటే ఆయన గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ఇక తాను రాజకీయాల్లోకి వచ్చింది కేవలం ప్రజాసేవ కోసమేనని, ఇరవైఐదేళ్ల పాటు రాజకీయాలు చేయడానికే వచ్చానని పవన్ కల్యాణ్ జనసేన పార్టీ పెట్టినప్పుడు చెప్పారు.



**ప్రజలకు సేవ చేయాలని...**

అయితే 2014లో పోటీ చేయకుండా ఆయన రాజకీయాలకు దూరంగా ఉన్నారు. ఇక 2019 ఎన్నికల్లో బీఎస్పీ, కాంగ్రెస్, కమ్యునిస్టులతో కలసి పోటీ చేసి చేతులు కాల్చుకున్నారు. అప్పుడు కాని ఆంధ్రప్రదేశ్ ప్రజల నాటి అర్థం కాలేదు. ఏపీ ఎన్నికల్లో గెలవాలంటే .. జగన్ ను ఎదుర్కొనాలంటే బీజేపీ, టీడీపీతో కలసి నడవడమే బెటర్ అని భావించి మూడు పార్టీలనూ కలిపి కూటమిని అధికారంలోకి తేగలిగారు. సీనియర్ గా, అనుభవమున్న చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉండటంతో పవన్ కల్యాణ్ ఉప ముఖ్యమంత్రి బాధ్యతలను తీసుకున్నారు. తనకు ఇష్టమైన శాఖలను అడిగి మరీ తీసుకుని వాటి ద్వారా ప్రజలకు సేవ చేయాలని నిర్ణయించి ఇతర విషయాల్లో జోక్యం చేసుకోవడం లేదు.

**వైసీపీకి అధికారంలోకి రానివ్వకూడదన్న...**

తన ప్రత్యర్థి వైసీపీని తిరిగి అధికారంలోకి రానివ్వ కూడదన్న నిర్ణయంతో ప్రభుత్వంపై మాట పడనివ్వకుండా ప్రతి నిమిషం కాపాడుకుంటూ వస్తున్నారు. ఎవరికి ఏ చిన్న సమస్య తలెత్తినా వెంటనే స్పందిస్తూ తానున్నానన్న భరోసా ఇవ్వడంలో పవన్ కల్యాణ్ ముందుంటున్నారు. అదే సమయంలో పవన్ కల్యాణ్ ను నమ్మి ఎందరో రాజకీయాలు వచ్చారు. వారికి కూడా అవకాశాలు ఇవ్వాలన్న నిర్ణయానికి వచ్చినట్లు తెలిసింది. గతంలో ప్రజారాజ్యంలో ఉన్నప్పుడు అనేక మంది పార్టీలోకి వచ్చి ఆర్థికంగా నష్టపోయారు. ఆ సంగతి పవన్ కు తెలియంది కాదు. అందుకే గత ఎన్నికల్లో కష్టపడి పార్టీ కోసం పనిచేసి, శ్రమించిన వారిని గుర్తించి వారికి పదవులను ఇవ్వాలని కూడా పవన్ కల్యాణ్ డిసైడ్ అయ్యారు.

**వారికే ప్రాధాన్యత...**

గత ఎన్నికల్లో కూటమి ఏర్పాటుతో కొన్ని నియోజకవర్గాలను మాత్రమే ఎంపిక చేసుకుని అందులోనూ కొందరికి మాత్రమే అభ్యర్థులగా ఎంపిక చేశారు. కానీ ఏడాది కాలంలో నామినేటెడ్ పదవులు కూడా కొన్ని కారణాల వల్ల కొందరికి ఇవ్వాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. అందుకే కొత్తగా పార్టీలోకి వచ్చిన వారిని కొంతకాలం పక్కనపెట్టి పాత వారికి, తొలి నుంచి జెండా పట్టుకున్న వారికి ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయించారు. ఇందుకోసం జాబితాను సిద్ధం చేస్తున్నారని తెలిసింది. రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల నుంచి ఫీడ్ బ్యాక్ తెప్పించుకుని నేతల పేర్లు తన డెయిరీలో నోట్ చేసుకుంటున్నారని, వారికి భవిష్యత్ లో పదవులు దక్కే అవకాశముందని చెబుతున్నారు. మొత్తం మీద పవన్ కల్యాణ్ ఇక పనిచేసిన నేతలకు పదవులు ఇవ్వాలన్న దానిపైనే కసరత్తు చేస్తున్నట్లు తెలిసింది.

# కొండా మురళిపై యాక్షన్ తీసుకుంటారా? అంత సీన్ ఉందా?

**హైదరాబాద్ పెన్ పవర్:**మాజీ ఎమ్మెల్సీ కొండా మురళిపై చర్య తీసుకోవాల్సిందేనని వరంగల్ కు చెందిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కోరినట్లు తెలిసింది. లేకుంటే తాము ఇలాంటి అవమానాలను ఎదుర్కొనాల్సి ఉంటుందని, ఖచ్చితంగా చర్యలు తీసుకోవాల్సిందేనని పట్టుబడుతున్నారు. ఈరోజు కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ ముందు వరంగల్ కు చెందిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు హాజరయ్యారు. మాట అనిపించుకుంది తాము, తిరిగి తమనే క్రమశిక్షణ కమిటీ ముందుకు పిలవడమేంటని వరంగల్ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కమిటీ ఎదుట అసహనం వ్యక్తం చేసినట్లు తెలిసింది. అయితే వాస్తవాలు తెలుసుకోవాలంటే ఇరు పక్షాల వాదనలను ఎవరైనా వినాల్సి ఉంటుందని, సమస్యకు పరిష్కారం కనుగొనాలంటే అందరి వాదనలను వినాల్సిన బాధ్యత కమిటీ మీద ఉంటుందని చెప్పారు.

**తాము కూడా బహిరంగంగానే...**

అయితే వరంగల్ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు మాత్రం తాము ఇక ఎక్కువ సమయం ఉపేక్షించలేమని, కొండా మురళి తన ఇష్ట మొచ్చినట్లు మాట్లాడుతుంటే చూస్తూ ఊరుకునే ప్రసక్తి లేదని తెలిపారు. తాము ఆ నిర్ణయం తీసుకోక ముందే కొండా మురళిపై చర్యలు తీసుకోవాలని, లేదంటే తాము హైకమాండ్ వరకూ వెళ్లి తమ నిరసనను తెలియజేస్తామని క్రమశిక్షణ కమిటీ ఎదుట చెప్పినట్లు తెలిసింది. తమను బహిరంగంగానే దూషించిన కొండా మురళిని అలా వదిలేస్తే ఇక తమను ఎవరు జిల్లాలో లెక్క పెడతారని, తమకు ఫ్రీ హ్యాండ్ ఇస్తే తాము కూడా బహిరంగంగానే కొండా కుటుంబం పై విమర్శలు చేయడానికి రెడీ గా ఉన్నామని కూడా క్రమశిక్షణ కమిటీ అధ్యక్షుడు మల్లు రవికి చెప్పినట్లు తెలిసింది.

**తమను దూషించిన వారిని వదిలేసి...**

అందుకు మల్లు రవి తనకు కొంత సమయం ఇవ్వాలని కోరారని, కమిటీ సమావేశంలో జరిగిన విషయాలు మీడియాకు చెప్పవద్దని కూడా ఎమ్మెల్యేలకు మల్లు రవి సూచించారు. కాగా వరంగల్ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు %జం% కొండా మురళిగా మారిపోయింది. ఈ వివాదం తెగదు తెల్లారేటట్లు లేదని ఎమ్మెల్యేలే కమిటీ ఎదుట అసహనం వ్యక్తం చేసినట్లు సమాచారం. తమను దూషించిన వ్యక్తి నేరుగా కమిటీని కలసి, చివరకు వినతి పత్రంలోనూ తమను తప్పుపడుతూ ఇచ్చినప్పటికీ కమిటీ ఏం చేయకుండా మీన మేషాలు లెక్క పెడితే ఎలా? అని ప్రశ్నించినట్లు తెలిసింది. తాము కూడా బహిరంగ వేదికలపై విమర్శలు చేసుకుంటూ పోతే పార్టీ పరువు బజారున పడుతుందని కూడా ఒక రకంగా హెచ్చరించినట్లు తెలిసింది.

**భోజనాలకు కూడా వెళ్లకుండా...**




క్రమశిక్షణ కమిటీ సంఘం కమిటీ ఛైర్మన్ మల్లు రవి వరంగల్ కాంగ్రెస్ ఎమ్మెల్యేలను అందరినీ భోజనాలకు పిలవగా, అందుకు వారు సున్నితంగా నిరాకరించి వెళ్లడం కూడా కమిటీపై అసంతృప్తిని వెళ్లగక్కినట్లయిందని అంటున్నారు. మరొక వైపు క్రమశిక్షణ కమిటీ కొండా మురళిపై చర్యలు తీసుకుంటుందా? లేదా? అన్నది ఆసక్తికరంగా మారింది. ఒకవైపు ఎమ్మెల్యేల ఒత్తిడి, మరొక వైపు జిల్లాలో బలమైన నాయకుడు మధ్య జరిగిన వివాదం కావడంతో సున్నితంగా దీన్ని పరిష్కరించడానికి క్రమశిక్షణ కమిటీ ప్రయత్నిస్తుందని తెలిసింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జోక్యం చేసుకుని ఇద్దరినీ పిలిచి కూర్చోబెట్టి మాట్లాడితే తప్ప సమస్యకు పరిష్కారం లభించదన్న అభిప్రాయం నేతల్లో వ్యక్తమవుతుంది. తెలంగాణ కాంగ్రెస్ లో క్రమశిక్షణ కమిటీ అంటే పెద్దగా ఎవరికీ భయం ఉండదు. ఎందుకంటే ఆ పార్టీలో ప్రజాస్వామ్యం ఎక్కువ. ఎవరిపైనైనా చర్యలు తీసుకుంటారన్నది మాత్రం అత్యాశే అవుతుంది.

# జగన్ వారిని దగ్గరకు తీసుకునే ప్రయత్నంలో ఉన్నారా? వారి వద్దకే వెళతారా?




హైదరాబాద్ పెన్ పవర్:వైసీపీ అధినేత వైఎస్ జగన్ కు గత ఎన్నికల్లో దెబ్బకొట్టిన సామాజికవర్గాలను తిరిగి దగ్గర చేర్చుకునే ప్రయత్నంలో ఉన్నట్లు కనపడుతుంది. తనకు గత ఎన్నికల్లో నలభై శాతం ఓట్లు వచ్చాయంటే అందులో ఎక్కువగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ ఓట్లు అని ఆయన అంచనా వేస్తున్నారు. అగ్ర కులాల ఓటర్లకు ఆయన దూరమయ్యారు. ప్రభుత్వంలో అధికారంలో ఉన్నప్పుడు అమలు చేసిన సంక్షేమ పథకాల వల్ల కావచ్చు. బటన్ నొక్కి రెండున్నర లక్షల కోట్ల రూపాయలు ఇవ్వడం వల్ల కావచ్చు. పదవులు, నామినేటెడ్ పోస్టుల భర్తీ ఇలా అన్నింటిలో కొన్నిసామాజికవర్గాలకు ప్రాధాన్యత ఇవ్వడంతో అగ్రవర్ణాలు దూరమయినట్లు జగన్ ఎన్నికల తర్వాత జరిపిన విశ్లేషణలో తేలింది.

**వారినే నమ్ముకుంటూ...**

ముఖ్యంగా అర్బన్ ఏరియాల్లో వైసీపీ దూరమవ్వడానికి ఈ వర్గాల ప్రజలేనని వైఎస్ జగన్ బలంగా నమ్ముతున్నారు. అందుకోసం జగన్ ఈసారి అధికారంలోకి రావాలంటే కేవలం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలపై ఆధారపడి రాజకీయం చేస్తే మాత్రం చెల్లదని, మిగిలిన వర్గాల వారిని కూడా కలుపుకుని పోవాలన్న లక్ష్యంతో ముందుకు వెళుతున్నట్లు కనిపిస్తుంది. అందులో భాగంగా త్వరలోనే జగన్ రెడ్డి, వైశ్య, బ్రాహ్మణ, కమ్మ, కాపు సామాజికవర్గానికి చెందిన ముఖ్యులతో సమావేశమవుతారని తెలిసింది. ఇందుకు సరైన తేదీలను నిర్ణయించాలని, తాడేపల్లి కేంద్ర కార్యాలయంలో కాకుండా ఈ సమావేశాలు ఎక్కడికక్కడ ఏర్పాటు చేయాలని జగన్ పార్టీ నేతలకు చెప్పినట్లు తెలిసింది.

**అక్కడకే వెళ్లి...**


కాపులతో సమావేశం రాజమండ్రిలోనూ, వైశ్యులతో సమావేశం విజయవాడలోనూ, కమ్మ సామాజికవర్గం ముఖ్యులతో గుంటూరులోనూ, రెడ్డి సామాజికవర్గం ముఖ్యులతో తిరుపతి లేదా నెల్లూరులోనూ, బ్రాహ్మణ సామాజికవర్గం ముఖ్యులతో విశాఖపట్నంలోనూ సమావేశాలు ఏర్పాటు చేయాలని, అందులో తాను స్వయంగా పాల్గొని వారికి తాను వచ్చే ఎన్నికల్లో గెలిచి అధికారంలోకి వస్తే ఏమేం చేయగలమో చెప్పనున్నారని పార్టీ సీనియర్ నేత ఒకరు చెప్పారు. ఎటూ సంక్షేమ పథకాల్లో తనకు తిరుగులేదు కాబట్టి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలు తనకు అండగా ఉంటాయని, వారికి తోడు వీరు కూడా కలిస్తే ఇక తన గెలుపు ఎవరూ ఆపలేరన్న నమ్మకంతో ఉన్నారు.

**రెడ్డి సామాజికవర్గం కూడా...**

గత ఎన్నికలలో రెడ్డి సామాజికవర్గం కూడా జగన్ కు దూరమయింది. దీనికి అనేక కారణాలు కనిపించాయి. కాంట్రాక్టు పనులు చేసినా వారికి డబ్బులు చెల్లించకపోవడంతో పాటు పనులు ఇవ్వకపోవడం, పదవుల్లో నియమించకపోవడం,

2014 నుంచి ఆర్థికంగా తమ డబ్బులు పోగొట్టుకుని పార్టీ కోసం పనిచేసిన వారిని కూడా గుర్తించకుండా కొందరికే అవకాశమివ్వడంతో రెడ్డి సామాజికవర్గం కూడా దూరమయింది. తనకు ముఖ్యమైన వారిని మినహాయించి ఎక్కువ మందిని ఇతర సామాజికవర్గాల వారిని నియమించుకోవడంతో అసంతృప్తికి గురైన రెడ్లు గత ఎన్నికలలో దెబ్బేశారు. ఇప్పుడు వారిని దగ్గరకు తీసుకునే పనిలో ఉన్నారని తెలిసింది. మొత్తం మీద జగన్ తన గేమ్ లో కొన్ని మార్పులు చేసినట్లు స్పష్టమవుతుంది.

# ఉద్యోగం లేదని ఫ్రస్టేషన్.. భార్య షాపింగ్ చేసిందని కోపం.. వెరసి మర్డర్




హైదరాబాద్ పెన్ పవర్:కుటుంబ బంధాలు పూర్తిగా కనుమరుగైపోతున్నాయి. ఉమ్మడి కుటుంబాలు విచ్ఛిన్నమైన సమయంలో భార్యా భర్తలు ఒక ఇంట్లో ఉండి శత్రువులుగా మారుతున్నారు. ఇద్దరి మధ్య రాజీ కుదర్చడానికి కూడా పెద్దలు లేకపోవడంతో గ్యాప్ పెరిగి చివరకు హత్యలకు దారితీస్తున్నాయి. చిన్న చిన్న కారణాలతో విడిపోయే వారు కొందరయితే.. మరికొందరు క్షణికావేశంలో చంపేస్తున్నారు. ఇంకొందరు ప్లాన్ చేసి మర్డర్ చేస్తున్నారు. తాజాగా బెంగళూరులో భార్య తనకు తెలియకుండా షాపింగ్ కు వెళ్లిందని ఆగ్రహించి భర్త కోపంతో భార్యను చంపేసిన ఘటన కలకలం రేపింది.

**ఇద్దరూ ఉద్యోగులే...**

బెంగళూరులోని బొమ్మనహళ్లి ప్రాంతంలో హరీశ్, పూజ ఉంటున్నారు. వీరికి వివాహం అయింది. ఇద్దరు పిల్లలు కూడా ఉన్నారు. ఇద్దరూ ఇంజినీరింగ్ చేసి ప్రయివేటు కంపెనీలో ఉద్యోగం కూడా చేస్తున్నారు. అయితే హరీశ్ కొన్ని నెలల క్రితం అనేక కారణాలతో ఉద్యోగం మానేశాడు. ఇంట్లోనే ఉంటున్నారు. పూజ మాత్రం ఉద్యోగం చేస్తూ ఇల్లు గడుపుతుంది. అయితే సహజంగానే ఇద్దరి మధ్య ఆర్థిక పరమైన గొడవలు వస్తున్నాయి. మళ్లీ పోత్తున్నాయి. అసలే ఉద్యోగం లేక ఇంట్లోనే ఉంటున్నానని ఫ్రస్టేషన్ లో ఉన్న హరీశ్ కు భార్య షాపింగ్ వెళ్లడం కాలిపోయింది.

**గొంతుపై కాలు వేసి నొక్కి...**

ఆర్థికంగా ఇబ్బందులు పడుతుంటే షాపింగ్ కు వెళ్లి అనవసరమైన వస్తువులను కొనుక్కుని వస్తావా? అని ఆగ్రహంతో హరీశ్ పూజపై ఊగిపోయాడు. ఇద్దరి మధ్య మాటా మాటా పెరిగింది. తనకు ఎదురు సమాధానం చెప్పడంతో తట్టుకోలేకపోయిన హరీశ్ ఆమెపై చేయి చేసుకున్నాడు. అంతే కాదు నేలపై పడేసి కాలితో ఆమె గొంతుపై బలంగా నొక్కాడు. దీంతో పూజ మరణించింది. అయితే పూజ మరణించిందన్న సమాచారాన్ని పోలీసులకు స్థానికులు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి హరీశ్ ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. పూజ మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

# కల్తీ కల్లు ఘటన, కాంగ్రెస్ పాలనపై కేటీఆర్ తీవ్ర విమర్శలు



హైదరాబాద్ పెన్ పవర్:కూకట్‌పల్లిలో వెలుగుచూసిన కల్తీ కల్లు ఘటనపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా స్పందించారు. ఈ ఘటన అత్యంత బాధాకరమని పేర్కొంటూ, బాధితుల పట్ల ప్రభుత్వం అనుసరించాల్సిన వైఖరిపై స్పష్టమైన డిమాండ్లు చేశారు. అదే సమయంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలపై సామాజిక మాధ్యమ వేదికగా తీవ్ర విమర్శలు గుప్పించారు. కల్తీ కల్లు ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే రూ.20 లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఆసుపత్రులలో చికిత్స పొందుతున్న బాధితులకు నాణ్యమైన, మెరుగైన వైద్య సేవలు అందేలా చూడాలని కోరారు. భవిష్యత్తులో ఇలాంటి విషాదకరమైన సంఘటనలు పునరావృతం కాకుండా కఠినమైన చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని ఆయన అన్నారు.

'ఎక్స్' వేదికగా కాంగ్రెస్ పాలనపై విమర్శలు గుప్పించారు. "ఇందిరమ్మ రాజ్యంలో ఇంటింటికీ బుల్డోజర్" అంటూ ప్రస్తుత పాలనను అభివర్ణించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను గాలికొదిలేసి, ప్రజలు అడగని బుల్డోజర్ పాలనను ముందుకు తెచ్చిందని ఆరోపించారు.

పేదలకు రూ.4000 పెన్షన్, మహిళలకు మహాలక్ష్మీ పథకం, రైతులకు రుణమాఫీ, రైతు భరోసా, విద్యార్థినులకు ఎలక్ట్రిక్ స్కూటీలు వంటి కీలక హామీలు ఏమయ్యాయని ఆయన ప్రశ్నించారు. మహానగరం నుంచి మారుమూల పల్లెల వరకు బుల్డోజర్ రాజ్యం నడుస్తోందని, తెలంగాణ ప్రజలు మేల్కోవాలని "జాగో తెలంగాణ జాగో" అంటూ పిలుపునిచ్చారు.

# ఇంతకంటే ఘోరం ఉంటుందా... ఆరేళ్ల పాపను పెళ్లాడిన ఆఫ్ఘన్ వ్యక్తి... ఆమెకు 9 ఏళ్లు వచ్చేదాకా ఆగాలన్న తాలిబన్లు!

**హైదరాబాద్ పెన్ పవర్:** ఆఫ్ఘనిస్థాన్‌లో సభ్య సమాజం తలదించుకునే దారుణ ఘటన వెలుగులోకి వచ్చింది. కన్న తండ్రే తన ఆరేళ్ల కూతురిని డబ్బు కోసం 45 ఏళ్ల వ్యక్తికి అమ్మి పెళ్లి జరిపించాడు. ఈ అమానవీయ ఘటన దక్షిణ ఆఫ్ఘనిస్థాన్‌లోని మర్జా జిల్లాలో చోటుచేసుకుంది. ఈ వార్త బయటకు రావడంతో సోషల్ మీడియాలో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది.



వివరాల్లోకి వెళితే, మర్జా జిల్లాకు చెందిన ఓ వ్యక్తి పేదరికం కారణంగా తన ఆరేళ్ల కుమార్తెను 45 ఏళ్ల వ్యక్తికి ఇచ్చి వివాహం జరిపించాడు. ఇప్పటికే ఇద్దరు భార్యలున్న ఆ వ్యక్తి, బాలిక కుటుంబానికి డబ్బు చెల్లించి ఈ పెళ్లికి ఒప్పించినట్లు అమెరికాకు చెందిన అము.టీవీ అనే మీడియా సంస్థ కథనం ప్రచురించింది. ఈ వివాహానికి సంబంధించిన ఫోటోలు బయటకు రావడంతో అవి పెను దుమారం రేపుతున్నాయి. చిన్నారి పక్కన కూర్చున్న మధ్య వయస్కుడైన వరుడిని చూసి నెటిజన్లు, మానవ హక్కుల కార్యకర్తలు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నారు.

ఈ విషయం తెలుసుకున్న స్థానిక తాలిబన్ అధికారులు వెంటనే రంగంలోకి దిగారు. వారి తీరు మరీ విడ్డూరం...! వారు ఆ వ్యక్తి, బాలికను తన ఇంటికి తీసుకెళ్లకుండా అడ్డుకున్నారు. అయితే, బాలికకు తొమ్మిదేళ్లు నిండిన తర్వాత భర్త ఇంటికి పంపవచ్చని వారు చెప్పినట్లు సమాచారం. ఈ ఘటనపై తాలిబన్ అధికారులు అధికారికంగా ఎలాంటి ప్రకటన చేయనప్పటికీ, బాలిక తండ్రిని, వరుడిని అరెస్ట్ చేసినట్లు హష్త్-ఎ-సుభ్ డైలీ అనే పత్రిక తెలిపింది. ప్రస్తుతం ఆ చిన్నారి తన తల్లిదండ్రుల వద్దే సురక్షితంగా ఉంది. ఆఫ్ఘనిస్థాన్‌లో 2021లో తాలిబన్లు అధికారం చేపట్టినప్పటి నుంచి బాల్య వివాహాలు గణనీయంగా పెరిగాయి. తీవ్రమైన పేదరికం, బాలికల విద్యపై ఆంక్షలు ఇందుకు ప్రధాన కారణాలుగా నిలుస్తున్నాయి. గతేడాది ఐక్యరాజ్యసమితి విడుదల చేసిన నివేదిక ప్రకారం, తాలిబన్ల పాలనలో బాల్య వివాహాలు 25% పెరిగాయని, ఇది బాలికల భవిష్యత్తును తీవ్రంగా దెబ్బతీస్తోందని మానవ హక్కుల సంస్థలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

# '298 మందితో వెళ్తోన్న విమానం కూల్చింది రష్యానే'... కోర్టు సంచలన తీర్పు!



**హైదరాబాద్ పెన్ పవర్:**సుమారు 11 ఏళ్ల కిందట.. 2014, జులై 17న మలేషియన్ ఎయిర్ లైన్స్ కు చెందిన బోయింగ్ 777 విమానం ఆమ్ స్టర్ డామ్ నుంచి కౌలాలంపూర్ కు 298 ప్రయాణికులు, సిబ్బందితో వెళ్తుండగా ఉక్రెయిన్ గగనతలంలో క్షిపణి దాడి జరిగిన సంగతి తెలిసిందే. రష్యా అధ్యక్షుడు పుతిన్ అనుమతితో ఆ దేశం అందించిన క్షిపణులతో ఉక్రెయిన్ వేర్పాటువాదులు ఈ దురాగతానికి పాల్పడ్డారనేది ప్రధాన ఆరోపణ.

ఈ విషయంపై గతంలో స్పందించిన అంతర్జాతీయ దర్యాప్తు బృందం సంచలన విషయాలు వెల్లడించింది. ఇందులో భాగంగా.. దాడిలో ఉపయోగించిన క్షిపణులు.. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ అందించినవే అని పేర్కొంది. ఈ ఘటనలో పుతిన్ జోక్యం ఉందనడానికి తమ వద్ద ఆధారాలున్నాయని పేర్కొంది. ఈ నేపథ్యంలోనే తాజా కోర్టు సంచలన తీర్పు వెలువడించింది.


అవును... 11 ఏళ్ల కిందట ప్రమాదానికి గురైన మలేషియన్ ఎయిర్ లైన్స్ విమానంపై దాడి జరిగిన ఘటనపై కోర్టు తీర్పు వెలువడించింది. ఇందులో భాగంగా.. ఆ విమానం కూల్చింది రష్యానేనని ఐరోపాకు చెందిన హ్యూమన్ రైట్స్ కోర్టు తాజాగా ఈ తీర్పు ఇచ్చింది. ఉద్దేశపూర్వకంగానే ఆ విమానంపై దాడి చేశారని, బహుశా అది సైనిక విమానంగా భావించి ఉండొచ్చని తన తీర్పులో పేర్కొంది.

మరోవైపు గతేడాది డిసెంబర్ లో అజర్ బైజాన్ ఎయిర్ లైన్స్ కు చెందిన జె2-8243 విమానం కుప్పకూలిన ఘటనలోనూ రష్యా పాత్ర ఉందనే విషయం తెరపైకి వచ్చింది. నాడు అజర్ బైజాన్ దేశ రాజధాని బాకు నుంచి రష్యాలోని గ్రోజ్నికి బయల్దేరిన విమానం కజఖ్‌స్థాన్ లో ల్యాండింగ్ సమయంలో కుప్పకూలింది. ఈ ఘటనలో 38 మంది మృతి చెందగా.. 29 మందికి తీవ్ర గాయాలయ్యాయి.

ఆ సమయంలో కూడా ఈ ఘటనకు రష్యానే కారణమంటూ ఆరోపణలు వెల్లువెత్తాయి. అయితే... ప్రమాదానికి తామే కారణమని వస్తున్న ఆరోపణలను అంగీకరించలేదు కానీ... దీనిపై పుతిన్ క్షమాపణలు మాత్రం చెప్పారు. మరోవైపు రష్యా భూభాగం నుంచి జరిగిన కాల్పుల వల్లే ఆ విమానం ప్రమాదానికి గురైందని అజర్ బైజాన్ అధ్యక్షుడు ఇల్హామ్ అలియెవ్ ఆరోపించారు.

ఈ నేపథ్యంలోనే మలేషియా ఎయిర్ లైన్స్ విషయంలోనూ రష్యా అంగీకరించడం లేదని అంటున్నారు. అంతర్జాతీయ దర్యాప్తు బృందంలో రష్యా భాగస్వామిగా లేనందున.. ఆ దర్యాప్తు ఫలితాను తాము అంగీకరించలేమని చెబుతోంది. ఈ తాజా తీర్పును రష్యా తోసిపుచ్చింది. మరోవైపు ఉక్రెయిన్ మాత్రం ఈ తీర్పు తమ గొప్ప విజయం అభివర్ణించింది.

## జగన్ ఓడిపోతారని నేను ఊహించలేదు.. కేటీఆర్ కామెంట్స్ వైరల్



**హైదరాబాద్ పెన్ పవర్:**2024 ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు రాజకీయ వర్గాల్లో తీవ్ర సంచలనం సృష్టించాయి. అధికార వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ (వైసీపీ) కేవలం 11 స్థానాలకు పరిమితమై అనూహ్య పరాజయాన్ని చవిచూడగా, టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఏకంగా 164 సీట్లు గెలుచుకొని భారీ విజయాన్ని నమోదు చేసింది. ఈ ఫలితాలు పొరుగు రాష్ట్రమైన తెలంగాణలోని రాజకీయ నాయకులను కూడా ఆశ్చర్యానికి గురిచేశాయి.

తాజాగా తెలంగాణ మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఈ ఫలితాలపై స్పందించారు. ఢిల్లీలో జరిగిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ వైసీపీ ఓటమి తనను ఆశ్చర్యానికి గురిచేసిందని పేర్కొన్నారు. "జగన్ ఓడిపోతారని నేను ఊహించలేదు. 2019లో 151 సీట్లను గెలిచిన పార్టీ, ఐదేండ్లలో 11 సీట్లకు పరిమితమవుతుందని ఎవరూ ఊహించలేదు" అని కేటీఆర్ తన ఆశ్చర్యాన్ని వ్యక్తం చేశారు.అయితే, ఓటమిపాలైనప్పటికీ వైఎస్ జగన్ సారథ్యంలోని వైసీపీ సుమారు 40 శాతం ఓట్లు సాధించిందని, ఇది చిన్న విషయం కాదని కేటీఆర్ అన్నారు. ప్రజల మద్దతు కొంత మేరకు ఇంకా ఉందని ఆయన గుర్తు చేశారు.ఈ ఎన్నికల్లో జనసేన అధినేత పవన్ కల్యాణ్ కీలక పాత్ర పోషించారని కేటీఆర్ అభిప్రాయపడ్డారు. పవన్ కల్యాణ్ ఒంటరిగా పోటీ చేసి ఉంటే ఫలితాలు పూర్తిగా భిన్నంగా ఉండేవని ఆయన వ్యాఖ్యానించారు. అలాగే వైఎస్ఆర్ తెలంగాణ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలను జగన్ ఓటమికి కారణంగా చూపే ప్రయత్నాలను ఆయన కొంత వ్యంగ్యంగా తిరస్కరించారు. "షర్మిలను కేవలం పావులా వాడుకున్నారు, అంతకుమించి ఆమె పాత్ర లేదు" అని వ్యాఖ్యానించారు.ఇంకా ప్రతిరోజూ ప్రజల్లో తిరిగే కేతిరెడ్డి ఓటమి చెందడం కూడా తనకు ఆశ్చర్యంగా ఉందని కేటీఆర్ అన్నారు. మొత్తానికి ఏపీ ఎన్నికల ఫలితాలు కేవలం ఆంధ్రప్రదేశ్‌లోనే కాకుండా తెలంగాణ రాజకీయ వర్గాల్లోనూ హాట్‌టాపిక్‌గా మారాయి. కేటీఆర్ వ్యాఖ్యలు వైసీపీ ఓటమిపై రాజకీయ విశ్లేషణకు కొత్త కోణాన్ని తీసుకువచ్చాయనడంలో సందేహం లేదు.

## శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ లాగిన్ తెరిచేందుకు యత్నం




హైదరాబాద్‌లోని ఒక ప్రభుత్వ కార్యాలయంలో సైబర్ దాడికి ప్రయత్నించిన సంఘటన వెలుగులోకి వచ్చింది. శేరిలింగంపల్లి మున్సిపల్ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న అభిలాష్ అక్రమాలకు పాల్పడినట్లు అధికారులు గుర్తించారు. బుధవారం అర్ధరాత్రి జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ హేమంత్ లాగిన్ తెరిచేందుకు అతను ప్రయత్నించాడు. జోనల్ కమిషనర్‌కు ఓటీపీ రావడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. అప్పటికే టౌన్ ప్లానింగ్ ఏసీపీ, సెక్షన్ ఆఫీసర్ల లాగిన్‌లు కూడా తెరిచినట్లు గుర్తించారు. విచారణ అనంతరం అభిలాష్‌ను జోనల్ కమిషనర్ సస్పెండ్ చేశారు.

# చనిపోయిన 12 గంటల తర్వాత మళ్ళీ బతికిన శిశువు.. అసలేం జరిగిందంటే.. ?



**హైదరాబాద్ పెన్ పవర్:**మహారాష్ట్రలో వింత ఘటన చోటు చేసుకుంది.. హాస్పిటల్లో చనిపోయిందని నిర్ధారించిన 12 గంటల తర్వాత ఖననం చేసే ముందు మళ్ళీ బతికింది నవజాత శిశువు. మహారాష్ట్రలోని బీడ్ హాస్పిటల్లో జరిగిన ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి.. బాలికా ఝుగే అనే మహిళ జులై 7వ తేదీ రాత్రి స్వామి రామానంద్ తీర్థ ప్రభుత్వ ఆసుపత్రిలో బిడ్డకు జన్మనిచ్చింది. ప్రసవం అయిన వెంటనే శిశువు మరణించినట్లు చెప్పారు వైద్యులు. ఆ తర్వాత 12 గంటలపాటు శిశువును ఆసుపత్రిలోనే ఉంచారు వైద్యులు.మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించిన తర్వాత శిశువును ఇంటికి తీసుకెళ్లారు బంధువులు. శిశువు అంత్యక్రియలకు సిద్ధం చేస్తుండగా శిశువు ముఖాన్ని చివరిసారి చూసేందుకు కప్పి ఉన్న వస్త్రాన్ని తీసి చూడగా.. శిశువు కదులుతున్నట్లు గమనించారు. బిడ్డ బతికే ఉన్నట్లు గ్రహించిన బంధువులు సంతోషంతో ఇంటికి తీసుకెళ్లారు. తర్వాత శిశువును అంబజోగై ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు, ప్రస్తుతం శిశువు పరిస్థితి నిలకడగా ఉందని తెలిపారు బంధువులు.

ఈ ఘటనకు ఆసుపత్రి సిబ్బంది నిర్లక్ష్యమే కారణమని ఆరోపిస్తోంది శిశువు తల్లి. ఆసుపత్రిలో శిశువు మరణించినట్లు చెప్పినప్పుడే కదలికలు గమనించానని.. దీని గురించి నర్సుకు చెబితే తమ మాట లెక్కచేయలేదని ఆరోపించింది తల్లి. ఈ ఘటనపై ఆసుపత్రి యాజమాన్యానికి ఫిర్యాదు చేశారు బాధితులు. ఈ ఘటనపై దర్యాప్తు జరిపేందుకు ఒక కమిటీని ఏర్పాటు చేశామని..ఘటనకు కారణమైనవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపింది ఆసుపత్రి యాజమాన్యం.

## మహిళలకు ఉచిత బస్సుతో పెట్టిన మెలిక.. ఆర్టీసీకి నష్టం లేదా?

**హైదరాబాద్ పెన్ పవర్:**ఆంధ్రప్రదేశ్ లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఆగస్టు పదిహేనో తేదీ నుంచి అమలు కానుంది. గత ఎన్నికలకు ముందు ఉచిత బస్సు ప్రయాణాన్ని మహిళలకు కల్పిస్తామని కూటమి పార్టీ నేతలు ప్రజలకు హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది తర్వాత ఉచిత బస్సుకు ముహూర్తం ఖరారయింది. అయితే ఉచిత బస్సు ప్రయాణం కేవలం జిల్లాలకు మాత్రమే పరిమితం చేయడంపై మహిళలు పెదవి విరుస్తున్నారు. కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం రాష్ట్ర వ్యాప్తంగా కొన్ని బస్సు సర్వీసుల్లో అమలు చేస్తుంటే, ఏపీ ప్రభుత్వం మాత్రం కేవలం జిల్లాలకే పరిమితం చేయడం ఏంటన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

**జిల్లాల పెంపుదలతో...**

గతంలో ఉన్న ఆంధ్రప్రదేశ్ కాదు. గత ప్రభుత్వం ఇరవై ఆరు జిల్లాలుగా చేసింది. పది ఉమ్మడి జిల్లాలను ఇరవై ఆరు జిల్లాలుగా మార్చింది. ప్రస్తుతం అవే జిల్లాలు కొనసాగుతున్నాయి. మహిళలు ఉచితంగా బస్సులో ప్రయాణం చేయాలంటే ఉమ్మడి జిల్లాలోని తమ వాళ్లు ఉన్న ప్రాంతాలకు కూడా వెళ్లేందుకు వీలులేని పరిస్థితి నెలకొంది. జిల్లాలు కుదించడంతో విస్తీర్ణం కూడా తగ్గడంతో బస్సు ప్రయాణం చేసే వారి సంఖ్య కూడా తక్కువగా ఉంటుందని ఆర్టీసీ అధికారులు అంచనా వేస్తున్నారు. దీనివల్ల ఆర్టీసీకి కాని, ప్రభుత్వానికి కానీ పెద్దగా నష్టం ఉండదు. ఉదాహరణకు ప్రకాశం జిల్లాలోని అద్దంకి బాపట్ల జిల్లాలో ఉంది. కానీ అద్దంకి ప్రజలు ఎక్కువగా ఒంగోలు వస్తుంటారు. కానీ ఒంగోలుకు అద్దంకికి చెందిన మహిళలు రావాలంటే ఉచిత ప్రయాణం కుదరదు.

**ఆర్టీసీకి కూడా భారం...**

అంటే ప్రభుత్వానికి కూడా పెద్దగా భారం అని పించదు. బస్సుల్లో

# రష్యాలో భారత టూరిస్టులకు ఎంత కష్టమొచ్చే..?



**హైదరాబాద్ పెన్ పవర్:**రష్యా పర్యటనకు వెళ్లిన భారతీయ పర్యాటకులపై అక్కడి ఇమ్మిగ్రేషన్ అధికారులు అమానుషంగా ప్రవర్తిస్తున్నారనే ఆవేదన వ్యక్తమవుతోంది. తాజాగా అమిత్ తన్వర్ అనే పర్యాటకుడు ఈ విషయం వెల్లడిస్తూ చేసిన ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్ ప్రస్తుతం వైరల్‌గా మారింది. తాము అకారణంగా నిర్బంధించబడ్డామని, పాస్‌పోర్టులు లాక్కొని, నేరస్థుల్లా వేధిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

ఈ నెల 8న 12 మంది భారతీయులతో కలిసి రష్యా పర్యటనకు బయలుదేరిన అమిత్ తన్వర్, తమకు సరైన పత్రాలు ఉన్నప్పటికీ రష్యా ఇమ్మిగ్రేషన్ అధికారులు తమను నిర్బంధించారని వెల్లడించారు. “వారిలో తొమ్మిది మందిని ఎలాంటి వివరణ లేకుండా గంటల తరబడి ఓ గదిలో ఉంచారు. కేవలం ముగ్గురిని మాత్రమే దేశంలోకి అనుమతించారు. మా పాస్‌పోర్టులు తీసేసి, సెల్‌ఫోన్లలోని ఫొటోలు, సెర్చ్ హిస్టరీ, యూట్యూబ్ యాక్టివిటీ వంటివన్నీ పరిశీలించారు,” అని వివరించారు.

అంతేకాకుండా “మా ఫోన్‌లలోని సమాచారం పరిశీలించిన అనంతరం మమ్మల్ని దేశం నుంచి బహిష్కరిస్తున్నట్లు చెప్పారు. మరో గదిలో తీసుకెళ్లి పెట్టారు. అక్కడ 2-3 రోజులుగా నిర్బంధంలో ఉన్న ఇతర భారతీయులు కూడా ఉన్నారు. కనీస సౌకర్యాలు లేకుండా మమ్మల్ని ఉంచుతున్నారు. మాతో వారు చూపుతున్న ప్రవర్తన పూర్తిగా అమానుషంగా ఉంది. విమాన టిక్కెట్లు బుక్ చేసుకుని స్వదేశానికి వెళ్లాలని అనుకున్నా, ఆ అవకాశం కూడా ఇవ్వడం లేదు” అని తన్వర్ వాపోయారు.

**భారత రాయబార కార్యాలయానికి విజ్ఞప్తి**

ఈ సందర్భంగా అమిత్ తన్వర్ మాస్కోలోని భారత రాయబార కార్యాలయం , ప్రధానమంత్రి నరేంద్ర మోదీని వేడుకున్నారు. “మేము నేరస్థులు కాదని, ఎందుకు బహిష్కరిస్తున్నారో స్పష్టం చేయాలని, మాకు న్యాయం చేయాలని” ఆయన కోరారు.

**ఉక్రెయిన్ యుద్ధ నేపథ్యం.. పెరుగుతున్న అనుమానాలు**

ఇటీవల ఉక్రెయిన్‌తో యుద్ధం నేపథ్యంలో రష్యాలో చిక్కుకుపోయిన పలువురు భారతీయులను మాస్కో సైన్యంలో పనిచేయించారని వార్తలు వెలువడ్డాయి. కేంద్ర ప్రభుత్వం ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణించి చర్యలు చేపట్టింది. ప్రధానమంత్రి మోదీ కూడా తన రష్యా పర్యటనలో ఇదే అంశాన్ని పుతిన్ ముందు ప్రస్తావించినట్టు సమాచారం.

అయితే, ఇప్పటికీ భారతీయ పర్యాటకులపై ఇలాంటి అన్యాయం జరుగుతుండటం గమనార్హం. అమిత్ తన్వర్ చేసిన ఆరోపణలపై భారత ప్రభుత్వం త్వరగా స్పందించి చర్యలు తీసుకోవాలని పర్యాటకులు, మానవ హక్కుల కార్యకర్తలు డిమాండ్ చేస్తున్నారు. తమ పౌరుల హక్కులను కాపాడేలా భారత ప్రభుత్వం తక్షణమే చొరవ తీసుకోవాల్సిన అవసరం కనిపిస్తోంది.

# తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాల తేదీలు ఖరారు : ఏర్పాట్లపై అదనపు ఈవో వెంకయ్య చౌదరి సమీక్ష




**హైదరాబాద్ పెన్ పవర్:**కలియుగ వైకుంఠం తిరుమలలో శ్రీవారి బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. సెప్టెంబర్ 24 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు జరగనున్న శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలపై గురువారం ( జులై 10 ) సమీక్ష నిర్వహించారు టీటీడీ అదనపు ఈఓ వెంకయ్య చౌదరి. ఈ సమీక్షా సమావేశంలో అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు వెంకయ్య చౌదరి. శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలకు ప్రణాళికలు రూపొందించి నిర్దేశిత సమయంలోపు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు వెంకయ్య చౌదరి.

**బ్రహ్మోత్సవాల వివరాలు:**

సెప్టెంబర్ 16 : కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం.
సెప్టెంబర్ 23: శ్రీవారి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ.
సెప్టెంబర్ 24: ధ్వజారోహణం.
సెప్టెంబర్ 28: గరుడ వాహనం.
అక్టోబర్ 01: రథోత్సవం.
అక్టోబర్ 02 : చక్రస్నానం.

**సమావేశంలోని ముఖ్యాంశాలు**

ప్రతిరోజూ ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు సాయంత్రం 7 గంటల నుంచి 9 గంటల వరకు వాహన సేవలు నిర్వహించాలని.. బ్రహ్మోత్సవ రోజుల్లో భక్తుల రద్దీ దృష్టిలో ఉంచుకుని ప్రోటోకాల్ ప్రముఖులకు మినహా వీఐపీ బ్రేక్ దర్శనాలు రద్దు చేయాలని.. వృద్ధులు, దివ్యాంగులు, చంటి పిల్లల తల్లిదండ్రులు, ఎన్ఆర్ఐ, దాతల దర్శనాలు కూడా రద్దు చేయాలని ఆదేశించారు.విజిలెన్స్, పోలీసు విభాగాల సమన్వయంతో పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేయాలని.. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ప్రత్యేక ప్రణాళికలు రూపొందించి, రోడ్ మ్యాప్ లు, పార్కింగ్ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు వెంకయ్య చౌదరి.

భక్తులకు దర్శన క్యూలైన్లు, మాడ వీధుల్లోని గ్యాలరీలు, ముఖ్యమైన ప్రాంతాల్లో విరివిగా అన్న ప్రసాదాలు పంపిణీ చేసేందుకు చర్యలు చేపట్టాలని.. భక్తుల అవసరాలకనుగుణంగా ఇంజనీరింగ్ పనులు చేపట్టాలని ఆదేశించారు.గ్యాలరీల్లో భక్తులకు సమస్యలు తలెత్తకుండా మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉంచేందుకు అదనపు సిబ్బందిని తీసుకోవాలని ఆదేశించారు వెంకయ్య చౌదరి. భక్తులను ఆకట్టుకునే విధంగా విద్యుత్ అలంకరణలు, ఫల, పుష్ప ప్రదర్శన ఏర్పాటు చేయాలని చెప్పారు.

శ్రీవారి సేవకులుగా యువతీ, యువకులను ఆహ్వానించి భక్తులకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేయాలని అన్నారు. సెప్టెంబర్ 27 రాత్రి 9 నుండి 29వ తేదీ ఉదయం 6 గంటల వరకు తిరుమల ఘాట్ రోడ్లలో ద్విచక్ర వాహనాలను అనుమతించొద్దని ఆదేశించారు.భక్తుల రద్దీకి తగినవిధంగా లడ్డూలు నిల్వ ఉంచుకోవాలని అన్నారు వెంకయ్య చౌదరి.